
**కథ**

# దోషులు

''సార్.. మన బిల్లుని పాస్ చేయనంటున్నాడు సార్'' గుమస్తా గోవిందం గాబరాగా ఫోను చేసాడు.



**సోమవఝల నాగేంద్రప్రసాద్**

''ఏం.. ఎందుకట?'' చేతిలో ఉన్న మందును సిప్ చేస్తూ కరకుగా అడిగాడు కాంట్రాక్టరు పాపారావు.

''ఏమో తెలియదు సార్'' వినయంగా జవాబిచ్చాడు గోవిందం.

''కారణం తెలుసుకోకుండా, నాకు ఫోను చేయొద్దని నీకు ఎన్నిసార్లు చెప్పాను'' ఫోనులోనే అతని మీద విరుచుకుపడ్డాడు పాపారావు.

''చిత్తం, చెప్పారు సార్. కానీ ఆ ఇంజనీరు కారణం అడగొద్దు అంటున్నాడండి'' ఇంకా వినయంగా చెప్పాడు గోవిందం.

''సరే ఇంతకీ అతనికి నా పేరు చెప్పావా? లేదా?'' విసుగ్గా అడిగాడు పాపారావు.

''చెప్పాను సార్, ఎవరి బిల్లైనా సరే పాస్ చేసేది లేదని ఖచ్చితంగా చెప్పాడు సార్'' వాపోయాడు గోవిందం.

''ఏంటి సీట్లోకి కొత్తగా వచ్చాడా? నా సంగతి అతనికి పూర్తిగా చెప్పలేకపోయావా'' గద్దించాడు పాపారావు.

''చెప్పి ఏం ప్రయోజనం లేదు సార్. కొత్తవాడు, రూల్సుగీల్సు అంటూ మాట్లాడుతున్నాడు. దేనికీ లొంగేలా లేడు సార్'' తన అబ్జర్వేషన్ చెప్పాడు గోవిందం.

''చాల్లే వెధవ కబుర్లు నువ్వూనూ. ఒక్క చిన్న బిల్లును పాస్ చేయించలేకపోయావు. పని ఎలా జరగాలో చూడలేని వాడివి ఎందుకయ్యా? రేపటి నుండి ఉద్యోగం మానేయ్'' గోవిందం మీద కోప్పడ్డాడు పాపారావు.

''అలాగంటే ఎలా సార్..? ఏదో పిల్లలు గలవాడిని. మిమ్మల్ని నమ్ముకొన్నాను. దయచేసి ఆగ్రహించకండయ్యా'' ఫోనులోనే దీనంగా వేడు

కున్నాడు గోవిందం.

"సర్లే, ఆ వెధవ ఏడుపొప్పు. ఇంతకీ సూపరింటెండెంట్ ఎక్కడున్నాడు" తాగుతున్న మందు కిక్కు ఇవ్వనందుకు బాధపడుతూ అడిగాడు పాపారావు.

"చిత్తం, ఆయన సీట్లోనే ఉన్నారండి, మాట్లాడించమంటారాండి" అడిగాడు గోవిందం.

"అనే కదా అర్థం, తొందరగా ఫోను అతనికివ్వు" విసుగ్గా అన్నాడు పాపారావు.

"ఆ పాపారావుగారా.. నమస్కారమండి. ఏంటి మరీ నల్లపూసైపోయారు. ఏంటి విశేషాలు? ఏంటి సంగతి దొరగారు ఎందుకో ఈ దాసుణ్ణి గుర్తుచేసుకున్నారు" లేనిపోని వినయాన్ని నటించాడు సూపరింటెండెంట్.

"ఈ నక్క వినయాలకేం లోటులేదు. అవునూ ఎవరో ఇంజనీరు కొత్తగా వచ్చేడుట, నా బిల్లని తెలిసి కూడా సంతకం చేయడం లేదుట. కొంచెం వాడి సంగతి చూసి, నా బిల్లు పాసయ్యేలా చూడు. మీకివ్వాల్సిన పెర్సంటేజులు ఇస్తున్నాను గదయ్యా. మరలా ఎందుకయ్యా ఇవన్నీ. కావలిస్తే అతనిని కొంచెం ఎక్కువ పెర్సంట్ తీసుకోమను. అంతేకాని, ఇలా చీటికి మాటికి నా బిల్లులు ఆపితే ఊరుకోనని కొంచెం అర్థం అయ్యేలా చెప్పు, తెల్సిందా!" ఇంచుమించు ఆర్డరు వేసినట్లుగా చెప్పాడు పాపారావు.



"తప్పకుండా సార్, ఏదో యువరక్తం కదా, రూల్స్, పాడు అంటున్నాడు. మెల్లిగా మన దార్లోకి వస్తాడు లెండి. నిన్ననే రోడ్డు ఇన్‌స్పెక్షన్‌కి వెళ్లాడు" విషయం చెప్పాడు సుబ్బారావు.

"ఈ ఇన్‌స్పెక్షన్ అవీ మనకి కొత్తేమి కాదు కదయ్యా. రోడ్డు పరిస్థితి ఎలా ఉన్నా, వేసినట్టు రాసి, బిల్లు పాస్ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం కదా! అందుకే కదా ప్రతి ఒక్కళ్ళ చేతులు తడుపుతున్నది ఇంతకు మించి నేనుమాత్రం ఏం చేయుగలను?"

"చిత్తం మహానుభావులు తమకి తెలియనిది ఏముంటాయి సార్" పాపారావుని మునగచెట్టు ఎక్కించే ప్రయత్నం చేసాడు సుబ్బారావు.

"అదీకాక రోడ్డువేసిన వెంటనే, వెనకాలే, ఆర్ అండ్ బీ వాళ్ళు, టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు వాళ్ల పనులంటూ ఎలాగూ వేసిన రోడ్లని తిరిగి తవ్వుతారుగదా. అలా గోతులు తవ్వినందుకు ఆ కాంట్రాక్టరు దగ్గర కూడా మీరు ఆమ్యామ్యాలు గుంజుతారు గదయ్యా! ఏమైనా మీ పనే బాగుందయ్యా, రెండు చేతులా సంపాదనే. సరేలే ఇవన్నీ ఎందుకుకాని, ఆ కుర్ర ఇంజనీరుకు చెప్పి నా బిల్లు పాసయ్యేలా చూడు చాలు" చెప్పాడు పాపారావు.

"సర్లెండి అవన్నీ నేను చూసుకొంటాను గదా! ఇహ ఆ విషయంలో మీరు నిశ్చింతగా ఉండండి. ఆ.. అన్నట్టు మొన్న మీరు పంపించిన ఆ పెద్దాపురం సరుకు బలే ఉంది సార్. మరొక్కసారి ఏర్పాటు చేయగూడదా? మీ బిల్లుని నిముషాలమీద పాస్ చేయిస్తాను" చొంగ కార్చుకుంటూ అన్నాడు సుబ్బారావు.

"బావుందయ్యా, మీకు పెర్సంటేజీలు ఇవ్వడమే కాకుండా ఇలా బ్రోకర్ పని కూడా చేయమంటున్నావన్నమాట. ఏం చేస్తాం ఖర్మ. ఇప్పుడు నా పిలక నీ చేతిలో ఉందయ్యా. సరే తప్పుతుందా, ఒకటి రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తానులే, ముందు ఆ బిల్లు సంగతి చూడు" ఖచ్చితంగా చెప్పాడు పాపారావు.

"ఇంక ఆ భారం నా మీద వదిలేసి, మీరు నిశ్చింతగా ముందుకొట్టి, హాయిగా తన్నిపెట్టి పడుకోండి" అభయం ఇచ్చాడు సుబ్బారావు.

అక్కడే ఉన్న ప్యూన్‌తో క్రొత్తగా వచ్చిన ఇంజనీర్ని పిలవమని చెప్పాడు సుబ్బారావు.

★ ★ ★

"ఏవోయ్, ఏవిటయ్యా ఇది?" కొత్తగా వచ్చిన ఇంజనీర్ని అడిగాడు సుబ్బారావు.

"ఏ విషయం సార్, దేని గురించి అడుగుతున్నారు?" అర్థంగాని ఇంజనీరు అడిగాడు.

"అదే, ఆ కాంట్రాక్టరు పాపారావుగారి బిల్లు గురించి.. ఇంక దేని గురించి" విసుగ్గా మొహం పెట్టి అన్నాడు సుబ్బారావు.

"ఏముంది సార్, నిన్న ఇన్‌స్పెక్షన్‌కి వెళ్లాను కదా, రోడ్డు సమంగా వెయ్యకుండానే బిల్లు పాస్ చేయమంటున్నారు" చెప్పాడు ఇంజనీరు.

"ఏమోనండి అసలు రోడ్డు వేయకుండా, రాళ్లని కూడా పూర్తిగా పరిపించకుండా ఎక్కడబడితే అక్కడ జల్లినట్లుగా ఉన్నాయి. ఇలా ఐతే

## నమితానందం

**తెలుగు నుంచి తమిళానికి వెళ్లిన ఉత్తరాది అమ్మాయి నమిత ఇప్పుడు అక్కడ తెగ బిజీగా వుంది. తాజాగా ఆమెకి అజిత్, విజయ్ లాంటి ప్రముఖ హీరోల సరసన హీరోయిన్ చాన్సులు వచ్చాయి. అలాగే దర్శకుడు సి.సుందర్ నటిస్తున్న సినిమాలో సైతం ఆమెకి నాయిక అవకాశం లభించిందిట. అంతేకాకుండా మరిన్ని మంచి చాన్సులు ఆమెని వెదుక్కుంటూ వస్తున్నాయి. దాంతో ఆనందం పట్టలేకపోతోంది నమిత. సన్నగా నాజూగ్గా వున్నప్పటి కంటే బొద్దుగా తయారయ్యాకే నమితకి ఆఫర్లు ఎక్కువ కావడం విశేషమే.**

ఎంత ప్రమాదమో కదా? దీనివలన ఎన్నో ఏక్సిడెంటులు జరుగవచ్చును'' చెప్పాడు ఇంజనీరు.

''సరేలేవయ్యా అలా జల్లిన రాళ్లమీద ప్రజల వాహనాలు తిరగ్గా, అణిగి ఆటోమేటిక్‌గా రోడ్డు తయారవుతుందయ్యా, అర్థం అయ్యిందా?'' పెద్ద జోక్ వేసినట్లుగా చెప్పాడు సుబ్బారావు.

''ఏమో సార్, మీరెంత చెప్పినా, ఆ బిల్లు పాస్ చేయడానికి నా మనసు అంగీకరంచడం లేదు'' చెప్పాడు ఇంజనీరు.

''చూడు బాబు నువ్వింకా కుర్రవాడివి. నా సర్వీసంత లేదు నీ వయసు. ఇలా ఈ నాలుగు 'మ'ల మంత్రంతో (మందు, ముక్క, మనీ, మగువ) ఎందరివో బిల్లులు పాసవుతూ ఉంటాయి. ఈ రోజుల్లో ఇదేమి కొత్తకాదు. మరీ ముక్కుకి సూటిగా పోతే బావుకొనేది ఏదీ లేదు, తెలిసిందా'' ఆ కుర్ర ఇంజనీరుకి గీతోపదేశం చేసాడు సుబ్బారావు. ''అందుచేత నా మాట విని చూసీ చూడనట్లుగా ఆ బిల్లుని పాస్ చేసేయ్. ఏమైనా వస్తే నేను చూసుకొంటాను గదా'' నచ్చచెప్పాడు సుబ్బారావు.

''మీరు ఇంతగా చెప్తే ఇంక చేసేదేముంది సార్, అలాగే నా మనసుని చంపుకుని ఆ బిల్లు మీద సంతకం చేస్తాను'' అంటూ అక్కడ నుండి బాధగా వెళ్ళిపోయాడు ఇంజనీరు.

మొత్తానికి ఆ విధంగా రోడ్డు పూర్తిగా వేయకపోయినా, వేసినట్లుగా తమ రికార్డులలో రాసుకుని, ఆత్మసాక్షిని అమ్ముకున్న ఆ అధికారులు కాంట్రాక్టరు పాపారావు బిల్లును సగర్వంగా పాస్‌గా చేసారు.

★ ★ ★

''ఏరా! నారిగా, ఈ రోజు బెంగుళూరు మిర్చి ఎలా ఇచ్చావురా?'' అడిగాడు కానిస్టేబులు కనకారావు.

''ఈయాల సానా ప్రియంగా ఉన్నాయి బాబు'' వినయంగా జవాబిచ్చాడు నారిగాడు.

''ఏమోరా.. ఈ రోజు బెంగుళూరు మిర్చి, బెండకాయలు, టమాటాలు, ఉల్లిపాయలు తెమ్మన్నారు'' సంచి వాడి మీదికి విసురుతూ చెప్పాడు కనకారావు.

''ఈయేట్లికి వదిలేయండి సారూ. అన్నీ మంచి రేటులున్న కూరగాయలే అమ్మగారు తెమ్మంటారు. ఇలా మీకు ఊరికే ఇచ్చేస్తే ఇక మాకేటి మిగులుద్ది'' విసుక్కున్నట్లుగా అన్నాడు నారిగాడు.

''ఏంటిరోయ్! నోరు లేస్తోంది. అయ్యగారితో చెప్పమంటావా? చెబితే ఏముండదు, నీ దుకాణం ఇక్కడే కాదు, ఈ సెంటర్లో ఇంకెక్కడా కూడా ఉండదు'' బెదిరిస్తున్నట్లుగా అన్నాడు కనకారావు.

''ఊరుకోండి సారూ! ఊరికే కూరలు దండుకున్నదే కాకుండా, ఇంకా బెదిరింపులొకటి. ఏం నేనొక్కణ్ణే రోడ్డుమీద ఇలా కూరలమ్ముతున్నానా? నాలాగే ఇంకా ఎంతోమంది ఉన్నారుగా వాళ్ల దగ్గర తీసుకోండి'' నిక్కచ్చిగా చెప్పాడు నారిగాడు.

''అదేంటిరా అలా అంటావు. ఇది అయ్యగారి ఏరియాకొచ్చే కూర్ల మార్కెట్, అందువలన మారు మాట్లాడకుండా అయ్యగారు ఇమ్మన్న కూరలు ఇవ్వాల్సిందే'' అదే రూలు అన్నట్లుగా మాట్లాడాడు కనకారావు.

''ఏం రూలో ఏంటో బాబు, అటు మార్కెట్ వాళ్ళకు డబ్బులిచ్చుకొని, ఇటు మీ పోలీసోళ్లకి అప్పనంగా కూరలిచ్చేస్తే ఇక మాకేటి మిగులుద్ది'' సణుక్కుంటూనే అతని సంచిలో కూరలు వేసాడు నారిగాడు.

''అదీ అలా రా దారికి, అయ్'' అంటూ అక్కడి నుండి అయ్యగారి కూరలతోపాటు తన ఇంటి కూరలు కూడా దండుకోవడానికి మరో దుకాణానికి వెళ్లాడు కనకారావు.

''రాను, రాను ఈ పోలీసోళ్ల జులుం మరీ ఎక్కువైపోతన్నది. ఇలా అప్పనంగా కూరలు అడుక్కోవడానికి సిగ్గులేదు'' మనసులోని బాధనంతా పైకి కక్కేసాడు నారిగాడు.

నారిగాడు అన్న మాటలు విన్న కనకారావు మాత్రం 'ఆ.. వాళ్లు అనడం మామూలే, మేం వినడం మామూలే' అన్నట్లుగా ప్రక్కవాడి దగ్గర కూరలకోసం తన సంచీని పట్టాడు.

పోలీసుల బెదిరింపులకు జడిసి, వాళ్లకి రోజు వారీ కూరలు ఇవ్వడం, అలా అక్రమంగా రోడ్డునాక్రమించుకొని తను కూరలు అమ్ముకుంటున్న వాళ్ళందరికి మామూలే. ఇలా రోడ్డుని సగానికి పైగా కూరలమ్మేవాళ్లే ఆక్రమించుకోవడం వలన అక్కడ ఎప్పుడూ ట్రాఫిక్ జామ్ అవడం సర్వసాధారణమైపోయింది. అయితే వాళ్ళకి పోలీసుల అండ ఉండడం వలన ఎవరూ ఏమీ అనలేకపోతున్నారు. ఇలా సగం రోడ్డు కూరగాయల వాళ్లతోటే నిండిపోవడంతో, ఆ మార్గం



## ప్రియాంక రెండు కోరికలు

హృతిక్ రోషన్‌తో 'క్రిష్', షారుఖ్ ఖాన్‌తో 'డాన్' సినిమాల్లో చాన్సులు రావడం తన అదృష్టంగా భావించే బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రాకి రెండు కోరికలున్నాయిట. అవేంటంటే- ఓ చారిత్రాత్మక చిత్రంలో నటించాలని, అలాగే ఓ మ్యూజిక్ ఆల్బమ్ రిలీజ్ చేయాలని. తనకి సంగీతంలో కొద్దో గొప్పో ప్రవేశం వుందిట. అందుకని తనే స్వయంగా పాటలు పాడి ఆల్బల్ విడుదల చేయాలని ఉబలాటపడుతోంది ప్రియాంక. మరి ఆమె ఈ రెండు కోరికలు ఎప్పటికి తీరతాయో!

గుండా వెళ్లే ప్రజల పాట్లు పట్టించుకునే నాధుడే లేడు.

''అబ్బా ఏంటిరా ఆ గొడవ'' చిరాగ్గా అడిగాడు ఎస్.ఐ. శేఖర్.

''ఏం లేదు సార్ ఆ లారీవాడు, వన్‌వే రూటులో వచ్చాడు సార్, వచ్చినందుకు డబ్బులివ్వమంటే ఇవ్వడంలేదు'' వినయంగా జవాబిచ్చాడు కానిస్టేబులు కనకారావు.

''ఏంటి ఈ ఏరియాలోకి మొదటిసారిగా వచ్చాడా? మర్యాదగా డబ్బులిచ్చి తొందరగా నడవమను. ఇప్పటికే ట్రాఫిక్ జాలా జామయ్యింది'' ఆర్డర్ పాస్ చేసాడు శేఖర్.

''అలాగే సార్'' అంటూ ఆ లారీ డ్రైవర్ దగ్గర ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేసి పంపించేసాడు కనకారావు.

ఆపాటికే వెనకాల ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కొన్నవాళ్ళు ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్ళు మాట్లాడుతున్నారు. కావాలనే ఇలా ట్రాఫిక్‌ని జాము చేయిస్తున్నారని ఒకరు, అక్రమంగా రూల్సుకి విరుద్ధంగా లారీలను సిటీలోకి ఎలవ్ చేస్తూ వాళ్ళ దగ్గర డబ్బులు గుంజుతున్నారని మరొకళ్ళు, ఎవరికి తోచినట్లు వాళ్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇదంతా తమకు మామూలే అనుకొంటూ ట్రాఫిక్‌ని క్లియర్ చేస్తున్నాడు అప్పారావు.

★ ★ ★

కాంట్రాక్టరు పాపారావుకు ఇద్దరు పిల్లలు. పెద్దవాడు శేఖర్, రెండవది కూతురు శకుంతల. కూతురు శకుంతలని ఆ ఊళ్లోనే పేరుమోసిన వ్యాపారి రంగారావు కొడుక్కిచ్చి ఈ మధ్యనే అతి వైభవంగా పెళ్లి జరిపించాడు.

కొడుకు శేఖర్‌కి తన పలుకుబడివల్ల తన ఏరియాలోనే ఎస్.ఐ.గా వేయించాడు పాపారావు.

శేఖర్ మొదట్లో ఎంతో నిజాయితీ పరుడిగా, అన్యాయాన్ని సహించలేనివాడుగా ఉండేవాడు. అయితే అతని తండ్రి చేసిన బోధనల వలన, పై అధికార్ల ధనవ్యామోహం వలన, అతను పూర్తిగా మారిపోయి తన అధర్మాలకి తిలోదకాలు పలికాడు.

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి, పదవి ఉండగానే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలి అన్న తండ్రి పాలసీని ఆదర్శంగా తీసుకొని, రెండు చేతులా అడ్డంగా సంపాదిస్తున్నాడు.

ఆ విధంగా సంపాదించి డబ్బులో కొంతభాగాన్ని తన పై అధికారులకు, కొంత భాగాన్ని తన క్రిందవారికి ఇవ్వడం పరిపాటి అయిపోయింది. అలా అక్రమ సంపాదనకోసం లారీలను జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలగుండా వదలడం వలన వచ్చే నష్టాల గురించి గాని, ప్రమాదాల గురించి గాని అతను ఎప్పుడు ఆలోచించలేదు. అలాగే ఆ లారీలలో ఏఏ సరుకులు వెళ్తున్నది కూడా పట్టించుకొనేవాడు కాదు. అతనికి తెలిసిందల్లా వాళ్ళ దగ్గర డబ్బులు వసూలు చేయడం, పై అధికార్ల జేబులతోపాటు తన జేబు నింపుకోవడం.

★ ★ ★

''హలో.. పాపారావుగారాండి. నేను డాక్టర్ సదాశివాన్ని, హెరిటేజ్ హాస్పిటల్ నుండి మాట్లాడుతున్నాను. మీరు అర్జెంటుగా హాస్పిటల్‌కి రావాలి'' అంటూ ఆతృతగా చెప్పాడు.

విషయం అర్థంగానిపాపారావు ''ఏం జరిగింది డాక్టరుగారు?'' కంగారుగా అడిగాడు.

''ఏం లేదు సార్, మీ అల్లుడుగారికి ఏక్సిడెంట్ అయింది'' విషయం చెప్పాడు డాక్టర్ సదాశివం.

''మా అల్లుడికి ఏక్సిడెంటా? ఏంటి మీరు చెపుతున్నది నిజమేనా? అసలా ఏక్సిడెంట్ ఎలా జరిగింది డాక్టర్? ఎవరు చేసారు?'' ఆతృతగా అడిగాడు పాపారావు.

''అవన్నీ ఇక్కడికి వచ్చిన తరువాత తెలుసుకొందురుగాని. ముందర మీరు తొందరగా హాస్పిటల్‌కి రండి'' అంటూ ఫోను పెట్టేసాడు డాక్టర్ సదాశివం.

ఆదరా బాదరాగా కూతురు శకుంతలను, కొడుకు శేఖర్‌ని తీసుకొని హాస్పిటల్‌కి వచ్చాడు పాపారావు. అప్పటికే జరగరాని అనర్థం జరిగిపోయింది. అతని అల్లుడు తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయాడు.

అల్లుడి మరణవార్త విని ఎంతగానో కృంగిపోయాడు పాపారావు. అతని కూతురైతే సరేసరి భర్త శవం మీద పడి కన్నీరుమున్నీరుగా ఏడుస్తోంది. కూతురి బాధని చూడలేక అతని గుండె చెరువైపోతోంది.

కానిస్టేబులు కనకారావు శేఖర్‌కి సెల్యూట్ చేసి అక్కడ జరగవలసిన మిగతా ఏర్పాట్ల సంగతి చూస్తున్నాడు. ఏక్సిడెంట్ ఎలా జరిగిందని అక్కడున్న వాళ్లని విచారిస్తున్నాడు ఎస్.ఐ. శేఖర్.

''ఏం లేదు సార్, బాబుగారు బహుశా జిమ్ నుంచి అనుకుంటా అటుకేసి వస్తున్నారు. ఎదురుగుండా అదిగో అక్కడున్న లారీ స్పీడుగా వస్తోంది సార్, ఈ లోపులో ఎవరో అక్కడున్న కూరల దుకాణంలో కూరలు కొనుక్కుని బాబుగారి మోటరు సైకిలుకి అడ్డంగా వచ్చినట్లున్నారు. రోడ్లు సరిగా లేవుకదు బాబూ, దాంతో బాబుగారి బండి కంట్రోలు తప్పి ఎదురుగుండా వస్తున్న లారీని గుద్దేశారు'' అంటూ తాము చూసింది చెప్పారు.

''ఇది వన్ వే రూటు కదా, అసలు లారీ ఎలా ఇటుకేసి వచ్చింది'' అడిగాడు పాపారావు.

''ఇక్కడ రోడ్లు పూర్తిగా వెయ్యకుండా, ఇంత నిర్లక్ష్యంగా వదిలేసిన కాంట్రాక్టరు ఎవరు?'' అక్కడున్న వాళ్ళని నిలదీశాడు శేఖర్.

''బావుంది సార్. మీ తండ్రీకొడుకుల ప్రశ్నలు చాలా బాగున్నాయి. ఏమీ తెలియనట్లు అడుగుతున్నారు'' ఎవరో ఎగతాళిగా అన్నారు.

''అంటే''? అర్థంకాని ఆ తండ్రీ కొడుకులిద్దరు ఒకేసారి అన్నారు.

''ఇందులో అర్థం కాకపోవడానికేముంది. అలా లారీలను వన్‌వేలోకి వస్తున్నాయంటే కారణం ఎవరు? మీలాంటి పోలీసులే. డబ్బుకి కక్కుర్తిపడి, లారీవాళ్లను చూసీచూడనట్లుగా సిటీలోకి వదిలేస్తున్నారు. మేం ఎప్పటినుండో మొత్తుకుంటున్నాం, ఇలా అదుపూ, ఆజ్ఞా లేకుంటే చాలా కష్టం అని. మా మాట ఎవ్వరైనా వింటేగదా!''

నిజమే తాను డబ్బుకి కక్కుర్తిపడి ఆ లారీ వాళ్లని వదిలేసేవాడు. అలా తాను వదలకుండా ఉండి ఉంటే ఈ రోజు ఇలా జరిగేది కాదేమో, పశ్చాత్తాపడ్డాడు శేఖర్.

''ఇంక రోడ్లు పూర్తిగా వేయకపోయినా, వేసినట్లుగా రికార్డుల్లో చూపించేసి డబ్బులు రాబట్టుకొన్నారు మీ నాన్నగారు. ఇలా సగం సగం వేసిన రోడ్లవల్ల ప్రజలకెంత ఇబ్బందో ఏనాడైనా ఆయన ఆలోచించారా? ఈ రోజు మీ కుటుంబానికి ఇలా జరిగింది కాబట్టి ఇన్ని వివరాలు అడుగుతున్నారు. ఇటువంటి పూర్తిగాని రోడ్లవలన మేం రోజూ ఎంత నరకయాతన అనుభవిస్తున్నది మీకేం తెలుస్తుంది? మా గోడు విన్న నాధుడే లేడు'' అక్కడున్నవారిలో ఎవరో ధైర్యంగా అన్నారు.

నిజమే తాము చేసిన తప్పుకి, ఆ భగవంతుడే ఇలా ఈ విధంగా తమకు శిక్షని ఈ రూపంలో విధించాడని ఆ తండ్రీకొడుకులిద్దరు బాధపడుతూ, దోషుల్లా వారి ముందు నిలబడ్డారు.

వాళ్ళ మాటల ద్వారా తన తండ్రి, అన్నయ్యల డబ్బు కక్కుర్తిని తెలుసుకొన్న శకుంతల వాళ్ళిద్దర్ని ఒక చీడపురుగుని చూసినట్లుగా చూసింది.

ఆమె చూపుల్లోని భావాన్ని గ్రహించిన ఆ తండ్రీకొడుకులిద్దరు తప్పుచేసిన వాళ్ళలా సిగ్గుతో తలలు వంచుకున్నారు.

★ ★ ★

ఇలా ప్రజల ఇబ్బందులను పట్టించుకోని పాపారావు, శేఖర్, కనకారావు, సుబ్బారావు లాంటి చీడపురుగులు మన సమాజంలో ఈనాడు ఎంతోమంది ఉన్నారు. వాళ్లు అలా మారడానికి కారణం ఎవరు? నిజమైన దోషులు ఎవరు?

☆